# త్రాసు

డబ్బు, డబ్బు, డబ్బు—

ప్రపంచంలో అన్ని సౌఖ్యాలకు డబ్బే మూలకారణం.

అందుచేత డబ్బున్న వాళ్ళంతా చాలా సుఖపడుతున్నారని అందరి అభిప్రాయం. అందుకే డబ్బులేని వాళ్ళందరికీ ధనవంతులను చూస్తే కాస్త ఈర్ష్యగా వుంటుంది. నిజమే!

పేదవాళ్ళందరికీ వారిబాధలకి మూలకారణం డబ్బు లేకపోవటం. బట్టలు చినిగిపోయినాయి, మంచి బట్టలు కొనుక్కోవాలి, కాని డబ్బులేదు. కట్టుకున్న పాక వానకు కురుస్తోంది. మళ్ళీ విప్పి కట్టుకోవాలి, కాని యెట్లా?

డబ్బెక్కడినించి వస్తుంది? ఒంట్లో నలతగా వుంది. డాక్టరు దగ్గరకు పోవాలి. కాని ఆ డాక్టరు ముందుగా బల్లమీద పది రూపాయలు పెట్టందె కన్నెత్తికూడా చూడడే! ఏం చెయ్యాలి! ఏముంది! ఇలాగే దగ్గుతూ రోజులూ గడపాలి.

డబ్బున్నవాళ్ళకి ఈ బాధలేమీ లేవు. వాళ్లు హాయిగా బట్టలు అక్కర లేకపోయినా కొనుక్కొని బీరువాలు నింపుకోవచ్చు. పైగా షాపువాళ్ళు "మీకేమిటిసార్! డబ్బు తర్వాత పంపవచ్చు సార్! ఈ కొత్తబట్టలు తీసుకోండి సార్!" అంటూ మరీమరీ బలవంతంచేసి బట్టలు అంటగట్టి పంపుతారు. పేదవాడు అవసర మొచ్చి అప్పు అడిగినా ఎవరూ ఇవ్వరు. డబ్బున్న వాళ్ళకు ఆకలి బాధ తెలియదు. హాయిగా ఫైవ్ స్టార్ హోటల్సుకు వెళ్ళవచ్చు. అక్కరలేనివన్నీ ఆర్డరు చెయ్యవచ్చు. మళ్ళా యేమీ

తినకుండానే సరదాగా బిల్లు చెల్లించి వచ్చెయ్యొచ్చు. మరి యివన్నీ బీద వాడికి సాధ్యంకాదుగదా! అందుకనే పేదవాళ్ళకు కాస్త కడుపుమంట. నిజమే!

సీతరామయ్యకు బాగానే డబ్బు ఉంది. అంతా ఆయన సంపాదించింది కాదు. కొంత వాళ్ళ తాతగారు సంపాదించారు. కొంత వాళ్ళ నాన్నగారు సంపాదించారు. మరికొంత ఆయన సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఏదో బిజినెస్ పెట్టాడు. అయితే ఈ మధ్య ఆ బిజినెస్‌లో లాభంకన్నా, నష్టమే ఎక్కువ వస్తోంది. దాన్ని చూచుకోటానికి ఓపికకూడా తగ్గిపోతోంది. అంచేత అది ఎవరైనా కొనుక్కుంటే అమ్మేసి, క్లోజ్ చెయ్యాలనివుంది. కాని నష్టం వస్తున్న వ్యాపారాన్ని ఎవరుకొనుక్కుంటారు? అంచేత అలాగే ఏదోలాకొనసాగిస్తున్నాడు. ఎటొచ్చీ నష్టం వస్తోందంటె ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళు మాత్రం నమ్మటంలేదు. ఏదో తప్పుడు లెక్కలు చూపిస్తున్నాడని అనుమానపడుతున్నారు. అందుకే మాటిమాటికీ ఆ ఫైలు తీసుకురా, ఈ ఫైలు తీసుకురా అని ప్రాణం తోడేస్తారు. ఈ ఫైల్స్ అన్నీ మోసుకుని ఆ ఆఫీసు చుట్టూ తిరగలేక ప్రాణం పోతోంది.

చిన్నప్పుడు సీతారామయ్య కాస్త జల్సాగానే బ్రతికాడు. రోజూ సింగారించుకుని సాయంత్రం కాగానే క్లబ్బుకు వెళ్ళటం, కాసేపు పేకాట, కాసేపు కబుర్లు కాస్సేపు మరొకటి. అల్లా అల్లారాత్రి పది దాకా కాలక్షేపం బాగానే వుంది. కాని యెటొచ్చీ నలభై యేళ్ళు దాటాక చక్రంమారింది. రెండుసార్లు హార్ట్ ఎటాక్ వచ్చి తగ్గింది. బ్లడ్ ప్రెషర్, డయాబిటీస్ అన్నీ పట్టుకున్నాయి. అంతటితో జీవితంలో స్వారస్యం తగ్గింది. ఇప్పుడు ఉప్పు తినకూడదు, కారం తినకూడదు. చక్కెర అసలే పనికిరాదు. మద్యం సేవించకూడదు. సిగరెట్లు కాల్చకూడదు. ఈ నిషేధాజ్ఞలు చాలా

ఎక్కువై పోయినాయి. అంతటితో బ్రతుకులో చవి చచ్చింది. ఇప్పుడు క్లబ్బుకు వెళ్ళడం మానేశాడు. ఒంటరిగా ఇంట్లోనే వుంటారు సాయంత్రం పూట. ఇంకెందుకూ వెళ్ళడం ! అక్కడ అందరూ కులాసాగా ఆడుతూ, పాడుతూ వుంటే తను ఊరికే వెఱ్ఱిమొహం వేసుకుచూస్తూ కూర్చోటానికి!

సీతారామయ్యకు ఒక్కతే కూతురు. ఆ కూతురు బి. ఎ. పాస యింది. ఈ మధ్యనే పెళ్ళి కూడా చేశారు. అల్లుడు యం. బి. బి. యస్. అల్లుడు చవకగానే దొరికాడు. కట్నం ఎక్కువ అడగలేదు. అయితే అతను కట్నం అడక్కపోవటంలో ఒక అంతరార్ధం ఉంది. మామగారు చాలా డబ్బున్నవాడుగదా! పెళ్ళైన వెంటనే తన్ ఫారిను పంపడానికి తగిన ప్రయత్నాలు చేస్తాడని అతని ఆశ. ఆ కోర్కె అతను పెళ్ళిలోనే వెళ్ళబెట్టాడు. ఎందుకో యం. బి. బి. ఎస్. పాసయి నప్పటినుంచి అతనికి ఫారిన్ వెళ్ళిపోవాలని వొకటే తొందర. ఒకటేపిచ్చి! ఎందుకో ఈ ఇండి యాలో ప్రజలకు మందులు యివ్వడానికి సుతరామూ యిష్టంలేదు. అయితే పెళ్ళయి రెండు నెలలయింది ఇంతవరకూ మామగారు ఫారిన్ పంపడానికి ఏ ప్రయత్నమూ చెయ్యక పోవడంతో అతనికి మామగారంటే పరమ అసహ్యంగా వుంది. రెండు నెలలుగా యిల్లరికమే వుంటున్నాడు. అయితే మామగారి ముఖం చూడడు. ఆయనతో మాట్లాడడు. భార్యను తీసుకుని రోజుకో సినిమాకు మాత్రం వెళ్ళిపోతూ ఉంటారు. సీతారామయ్యకు అల్లుడి కోప కారణం తెలుసు. అయితే మాత్రం అక్కడా ఏం చేస్తాడు! ప్రస్తుతం డబ్బు అందుబాటులో లేదు. అక్కడక్కడా అప్పులు మాత్రమే వున్నాయి. ఆ విషయం ఎవరికీ తెలియదు. మేడా, కారు ఇవి మాత్రమే బయటికి కనపడతాయి. అల్లుడి ప్రవర్తనకు ఆయన మనస్సు చివుక్కు మంటుంది. ఏం చేస్తాడు! ఏదో ప్రయత్నం చేసి ఎల్లాగో అల్లుడిని ఫారిన్ పంపించాలి, అదే దిగులుపడుతూ ఉంటాడు.

కూతురు అరుణ రోజుకో నైలెక్సు చీర కావాలంటుంది, వారాని కొక ముత్యాల నెక్‌లెసో, డైమండ్ గాజులో కావాలంటుంది. అంతకన్నా ఏమీ అక్కరలేదు తండ్రితో చెప్పదు. తండ్రిని అడగదు. చక్కగా అన్ని షాపుల్లో అకౌంట్సు ఉన్నాయి. హాయిగా వెళ్ళి తెచ్చుకుంటుంది. ఎప్పుడో సీతారామయ్యకు తెలుస్తుంది, కూతురిని ఏమనడానికీ వీలులేదు. అడిగితే ఏడుస్తుంది. ఆ ఏడుపుచూస్తే ఆయన గుండె తరుక్కుపోతుంది. ఏమన లేక నోరుమూసుకుని ఊరుకుంటాడు. షాపుల్లో అకౌంట్సు పాపం పెరిగి నట్లు పెరుగుతూ వుంటాయి.

భార్య కమలమ్మ లోకల్ లేడీస్ క్లబ్బు ప్రెసిడెంట్. పదేళ్లుగా ఆమె పదవీ విరమణ చెయ్యలేదు. ఒక్కత్తే కూతురు కావటం, ఆ పిల్లా ఎప్పుడూ హాస్టల్సులోనే వుంటూ జల్సాగా తిరుగుతూ వుండడం, కమ లమ్మకు ఇంట్లో పనీపాటా ఏమీలేదు. అంచేత ఆమె మెల్లిగా లేడీస్‌క్లబ్‌లో చేరి దానికి ప్రెసిడెంటైంది. ఆ క్లబ్బులో మెంబర్లంతా బాగా డబ్బున్న వాళ్ళే! అందరూ పనీ పాటా యేమీ లేని వాళ్ళే! అంచేత చీరెల విషయంలో, నగల విషయంలో అన్నింటిలో వొకళ్ళ నొకళ్ళు యేమీ తీసిపోకూడదని భలే పట్టుదలగా వుంటారు. ఒకామె యేదో విధంగా ఫారిన్ టూరు వెళ్ళి వచ్చిందంటే వెంటనే మరో నలుగురు మెంబర్లైనా వెళ్ళి వస్తారు. హాయిగా క్లబ్బులో కూర్చుని ఏ షాపులో ఏం చీరలు దొరుకు తున్నాయో, లేటెస్ట్ ఫాషన్స్ ఏమిటో అలా అలా డిస్కస్‌చేస్తూ ఉంటారు. ఏమీ తోచకపోతే కాసేపు పేకాడతారు. ఆదివారాలు మాత్రం అంతా తొమ్మిది గంటలకల్లా ఫారిన్ నైలెక్స్ చీరలు కట్టుకుని కార్లలో బయలుదేరి సరదాగా అలా స్లమ్ క్లీనింగ్‌కువెళ్ళివస్తారు. ఫొటోగ్రాఫరును మాత్రం ఎప్పుడూ మరచిపోరు. అక్కడ రెండు పాకలముందు నిలబడి ఇల్లు చాలా శుభ్రంగా ఉంచుకోవాలని ఇద్దరు ఆడవాళ్ళకు చెబుతారు. తమ

చీరలు ఎక్కడ పాడవుతాయోనని జాగ్రత్తగా కుచ్చెళ్ళు ఎత్తి పట్టుకుంటూ! ఆ ఆడవాళ్ళకి వీళ్ళు చెప్పేదేమీ అర్థంకాదు. అయినా వీళ్ళని వింతగా చూస్తూ వుంటారు. అట్లాంటి సిల్కు చీరలు ఎల్లాగూ తమరు కొని కట్టుకునే భాగ్యంలేదు, ఊరికే చూసి అయినా ఆనందిద్దామని, అలా చూస్తూ వుంటారు. ఫొటోగ్రాఫరు కావలసినన్ని ఫొటోలు తీస్తాడు. అవన్నీచక్కగా వస్తాడు అన్ని పేపర్లలో వస్తాయి. మరి మెంబర్లంతా మంచి అంతస్థు వున్నవాళ్ళే కదా!

ఆ లేడీస్ క్లబ్‌కు ఇప్పుడు వెనక ఒక పెద్దహాలు కట్టించాలనుకుంటున్నారు. అందుకు అందరి దగ్గరా విరాళాలు సేకరిస్తున్నారు. వైస్ ప్రెసిడెంట్ చంద్రకాంతమ్మ తాను ఐదువేలు ఇస్తానంది. అంచేత తాను ప్రెసిడెంటుగా వుండి పదివేలు అయినా ఇవ్వకపోతే బాగుండదనుకుంది కమలమ్మ. అమాటే ఆఖరుమాటగా చెప్పింది ఆవేళ ఉదయం కమలమ్మ సీతారామయ్యతో. ఆయన గుండెల్లో రాయిపడింది. ఇప్పుడు పదివేలు యెక్కడినుంచి తెస్తాడు? ఇంకా కట్టవలసిన టాక్సులన్నీ అలాగే వున్నాయి అయినా తేకతప్పదు. లేకపోతే భార్య వూరుకోదు. సీతారామయ్య గుండెల్లో నిస్పృహ చుట్టుకుంది. భార్య కూతురు, అల్లుడు, వీళ్ళందరి కోర్కెలు తీర్చడానికి తానొక మెషీన్. ఎవరికీ తన సంగతి అక్కరలేదు.

సాయంత్రం దిగులుగా వొక్కడూ డాబామీద కూర్చున్నాడు. అందరూ యెవరిదోవన వాళ్ళు వెళ్ళారు. భార్య క్లబ్బుకు, కూతురు, అల్లుడూ సినిమాకూ, ఇప్పుడు సాయంత్రాలు ఇల్లాగే గడుస్తున్నాయి, ఏకాంతంగా !

దూరంగా, ఒక మూల డాబామీద గురవయ్య కూచున్నాడు. తల వంచుకుని ఏదో తన లోకంలో తాను పనిచేసినప్పుడల్లా వాడల్లానే కూచుంటాడు. సీతారామయ్యకు కాస్త దూరంగా, పిలిస్తే పలకడానికి వీలుగా!

వాడు పదేళ్ళ వయస్సు అప్పుడు సీతారామయ్య దగ్గర పనికి చేరాడు, ఇప్పుడు పాతికేళ్ళ సర్వీసు అయింది. అయితే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఏమీలేవు. అసలు రిటైర్‌మెంటే లేదు.

ఈ మధ్య కొన్నాళ్ళ క్రిందట వాడు పెళ్ళి చేసుకున్నాడు. ఆ భార్య రెండేళ్ళు బాగానే కాపురం చేసింది. ఒక ఆడపిల్లను కన్నది. ఆ పిల్లకు ఆరునెల్ల వయస్సప్పుడు ఒక రోజు చెప్పాపెట్టకుండా పక్కింటివాళ్ళ డ్రైవరుతో లేచ్చక్కాపోయింది. పసిబిడ్డను చేతిలో పెట్టుకుని గుర వయ్య కుమిలి కుమిలి ఏడ్చాడు, ఎవరికీ ముఖం చూపించలేక పిగ్గుపడ్డాడు, మూడు రోజులకు వాడి భార్య వెళ్ళిన మనిషి వెళ్ళినట్లే మళ్ళా తిరిగి వచ్చింది. కాని పక్కింటివాళ్ళు కారు డ్రైవరును తీసి పారేశారు. క్రొత్త డ్రైవరును పెట్టుకున్నారు. కాని పాపం వీడు భార్యను అంత సులభంగా తీసివెయ్యలేక పోయాడు. మమకారం చంపుకోలేకపోయాడు. గుట్టు చప్పుడుగాకుండా మళ్ళీ దానితోనే సంసారం సాగించాడు, అది మళ్ళా ఒక ఏడాది బాగానే కాపురం చేసింది. మళ్ళా ఏమొచ్చిందో! మళ్ళా లేచ్చక్కాపోయింది. ఈసారి ఎవడితో పోయిందో తెలీదు. అది మళ్ళా రాలేదు. వీడు పసిపిల్లతో సతమత మయ్యాడు, చాలా బాధపడ్డాడు అంత లోకి వాడిచెల్లెలు వచ్చింది. ఆవిడకు డబ్బుంది. డాబా ఇల్లువుంది. అన్నీ వున్నాయి. కాని పిల్లలులేరు. అంచేత ఆవిడ ఈ పసి పిల్లను తీసుకు పోయి తను పెంచుకుంటానని పట్టుబట్టింది. భార్యకోసం ఏడుస్తున్న వీడు బిడ్డనుకూడా వదులుకోటానికి ఇష్టపడలేదు. అయినా ఆవిడ పట్టువదలలేదు. "నీ మొహం, నువ్వేం పెంచుతావు. నేను తీసుకుపోతాను అప్పుడప్పుడూ వచ్చి చూసి పోతుండు", అని చెప్పి ఆ బిడ్డను తీసుకు చక్కాపోయింది. అంతే! అలా భార్యా బిడ్డా ఇద్దరూ దూరమైనప్పటి నుంచి వీడికి అసలు లైఫ్‌లోనే ఇంటరెస్టు పోయింది. వాడికి ఉన్న ఇంటరెస్ట్ అల్లా ఒక్కటే! అలా సీతారామయ్యకు మరీ దగ్గరగా కాకుండా, మరీ దూరంగా కాకుండా, అలా ఆయన్ను కనిపెట్టుకు కూచోటం! అదేదో ఋణానుబంధం! ఎడ తెగని అనుబంధం!

ఎప్పుడైనా వెళ్ళి కూతుర్ని చూసివస్తాడు. ఆ పిల్ల వీడిదగ్గరకు రాదు. ఎవరో కొత్తమనిషిని చూసినట్లు చూస్తుంది. అది వీడ్ని కుంగ దీస్తుంది. అయినా పిల్ల సుఖంగా వుందిగదా అని, వీడు సంతోషిస్తాడు. ఏదో ఒక గౌను, కాస్త మిఠాయి చేతిలోపెట్టి మళ్ళా బాబుగారి సేవకు హాజరవుతాడు. మళ్ళా పెళ్ళి చేసుకోమంటే చేసుకోలేదు.

సాయంత్రం ఏడు గంటలవుతోంది. వంటవాడు వచ్చి చెప్పాడు. "బాబుగారూ! భోజనం వడ్డించాను" అని. సీతారామయ్య ఉసూరుమన్నాడు. వెళ్ళక తప్పదు. గుండెజబ్బు కాబట్టి, డాక్టరు పెందరాళే భోజనం చేస్తే మంచిదన్నాడు.

సీతారామయ్య వెళ్ళి బల్ల దగ్గర కూచున్నాడు. కాస్త అన్నం, కొంచెం ఉప్పు, కారం లేకుండా ఉడకబెట్టిన కూరముక్కలు, కాస్త మజ్జిగ రెండు ఎండిపోయిన చపాతీలు అక్కడ పెట్టి ఉన్నాయి. ఆ భోజనం చూడగానే సీతారామయ్యకు ఆకలి చచ్చిపోయింది. తినాలనిపించలేదు. కొందరికి తినాలని ఉంటుంది. తినడానికి ఏమీ దొరకదు. కొందరికి తినడానికి అన్నీ ఉంటాయి కాని తినడానికి వీలుపడదు. విశాలమైన భోజనాల గది బావురుమంటోంది. రోజూ సీతారామయ్యకు ఒంటరి భోజనమే! సరదాగా కబుర్లు చెప్పడానికి, ఆప్యాయంగా వడ్డించడానికి అక్కడ ఎవరూ ఉండరు. కాస్త దూరంగా వంటవాడు, ఇంకాస్త దూరంగా గురవయ్య తప్ప. ఇష్టంలేకుండా ఏదో నాలుగు మెతుకులు తిన్నాడు సీతారామయ్య, మళ్ళాలేచి డాబామీదకు వెళ్ళాడు. ఆరుబయట పడకకుర్చీలో స్థిర పడ్డాడు. అలా ఓ గంటో, రెండు గంటలో గడిపితే వెళ్ళిపడుకోవచ్చు. ఇంట్లో తతిమావాళ్ళు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పడుకుంటారో అతనికేమీతెలీదు.

వరండాలో దీపం వెలుగుతోంది. ఆరుబయట కాస్త వెలుతురుగా, కాస్త చీకటిగా వుంది. గురవయ్య వచ్చాడు. "బాబుగారు!" సీతారామయ్య తలెత్తి చూశాడు. గురవయ్య రెండు గులాబీపూలు. ఒక ఆపిల్ పండు

సీతారామయ్య చేతిలో పెట్టాడు. సీతారామయ్య గులాబీపూలు ఆప్యాయంగా వాసన చూశాడు. గురవయ్యను అడిగాడు. "ఎక్కడివిరా గులాబీపూలు!" అని గురవయ్య నసుగుతూ అన్నాడు. "మన తోటలోవేనండీ" అని. అలాగా! తోటలో గులాబీ పూలు పూస్తున్నాయి కాబోలు! ఎవరూ పట్టించు కోరు. "ఈ ఆపిల్ పండు ఏమిటిరా?" అన్నాడు సీతారామయ్య. గురవయ్య మరికాస్త సిగ్గుపడ్డాడు. తలవంచుకుని అన్నాడు!" "ఇవ్వాళ తమ పుట్టిన రోజండీ". సీతారామయ్య తెల్లబోయాడు. ఇవ్వాళ తన పుట్టినరోజా? ఎవరికీ గుర్తులేదే? తనకూ్కడా గుర్తులేదే? గురవయ్య మళ్లా అన్నాడు. "అవు నండీ! ఇవ్వాళ వినాయకచవితి" వినాయక చవితా? ఇంట్లో ఎవరూపండుగ చెయ్యలేదే? అవును! ఇప్పుడు పండుగలు చెయ్యటం ఫాషన్‌కాదు. ఇంట్లో పండుగలు చేసి చాలా రోజులైంది.

సీతారామయ్య కాసేపు నిశ్శబ్దంగా వున్నాడు. తరువాత గురవయ్యను పిలిచాడు. "ఒరేయ్! నా గదిలో వంకెన తెల్లచొక్కా ఉందిగదరా! అది పట్టుకురా!" అన్నాడు. గురవయ్య వెళ్ళాడు, చొక్కా తెచ్చాడు. సీతా రామయ్య చొక్కా జేబులోంచి పర్సు తీశాడు, పాతిక రూపాయలు గుర వయ్యకు యిచ్చాడు, గురవయ్య తెల్లబోయాడు "వద్దు బాబు, నా కెందుకూ డబ్బు?" అన్నాడు, సీతారామయ్య అన్నాడు. "తీసుకోరా ! ఈసారి వెళ్ళి నప్పుడు మీ పాపకు కొత్తగౌను కొను."

పాపపేరు చెప్పగానే గురవయ్యముఖం వికసించింది, చిరునవ్వుతో, కృతజ్ఞతతో సీతారామయ్య కేసి చూచాడు. అల్లాంటి చిరునవ్వు ఎప్పుడూ సీతారామయ్యకు తన భార్య ముఖంలోగాని, కూతురు ముఖంలోగాని, అల్లుడి ముఖంలోగాని చూసిన గుర్తులేదు, ఎందుకో అంతలో అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

—: 0 :—